# 20 ఆగస్టు 2021న జాతీయ శాస్త్రీయ దృక్పథం దినంగా పాటించండి..

***Covid** ను ఎదుర్కోవడానికి శాస్త్రీయ దృక్పథం అవసరం..*

*జ్యోతిష్యాన్ని  ప్రోత్సహిస్తున్న ప్రభుత్వ చర్యలను వ్యతిరేకించండి..*

**- జన విజ్ఞాన వేదిక, AIPSN**

ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (INGOU) విద్యాలయం ఈ సంవత్సరం నుండి జ్యోతిష్యాన్ని ఓ శాస్త్రంగా, ఎం.ఏ పట్టా ( MA JYOTISH) బోధించడానికి ప్రకటన ఇచ్చింది. ప్రజల సొమ్ము తో నడుస్తున్న కొన్ని ఇతర విశ్వవిద్యాలయాలు ఇదివరకే ఈ అంశాన్ని బోధిస్తున్నాయి. ఆలిండియా పీపుల్ సైన్స్ నెట్వర్క్(AIPSN) మరియు ఇతర అనుబంధ సైన్స్ ప్రచార సంస్థలు దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. నూతన విద్యా విధానం (NEP 2020)లో సిఫార్సు చేసినట్లు భారతీయ విజ్ఞాన విధానం (INDIAN KNOWLEDGE SYSTEM)ను అన్ని దశలలో పాఠ్యాంశాలుగా చేయడంలో భాగంగా ఈ జ్యోతిష్యాన్ని ప్రచారం చేయడానికి విశ్వవిద్యాలయాలు కంకణం కట్టుకున్నాయి.

ప్రాచీన భారతదేశం ఖగోళ శాస్త్రము, గణితము, ఖనిజ శాస్త్రము, తత్వశాస్త్రము మొదలగు అంశాలలో మహోన్నతమైన జ్ఞాన సంపదను ప్రోది చేసింది. అన్ని ప్రాచీన సంస్కృతులు, అనేక శతాబ్దాలుగా, అనేక విధాలుగా ఈ శాస్త్ర విజ్ఞాన  సంపద అనే వృక్షానికి నీరు పోసి పెంచుటలో తమ వంతు కృషి చేసాయి. ఈ సమిష్టి జ్ఞాన సంపద లో భారతదేశం కూడా పాత్ర పోషించింది, తనదైన ముద్ర వేసింది.

కానీ పురాణాలలోని కొన్ని అంశాలను ఉటంకిస్తూ అభూత కల్పనలు చేసి అవన్నీ శాస్త్ర సాంకేతిక రంగాలలో అన్నీ మనమే కనుగొన్నామని ప్రచారం చేస్తున్నారు. (ఉదాహరణకు గాలిలో ఎగిరే యంత్ర సాంకేతిక పురాణాల్లో ఉందని, జ్యోతిష్యంలో అద్భుతాలు కనుగొన్నామని ప్రచారం).. ఈ తప్పుడు ప్రచారం వల్ల భారతదేశపు అసలైన జ్ఞాన సంపద చరిత్రకు మచ్చ వస్తోంది. అనవసరంగా ఈ అశాస్త్రీయ భావాలు చదివే విద్యార్థులు ప్రతి నిమిషం  నిజమైన భారతదేశ శాస్త్రీయ భావాలను నేర్చుకునేందుకు వెచ్చిస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుంది. నిజానికి ఈ జ్యోతిష్యం, జ్యోతిష్య శాస్త్రం మన భారతదేశం కనుగొన్నది కాదు. క్రీస్తు పూర్వం 4వ శతాబ్దంలో కల్దీయులు(Chaldeans), గ్రీకుల ఆలోచనల ద్వారా భారతదేశం లోకి ప్రవేశించింది. అంతవరకు మనదేశంలో ఈ రాశులు, వాటి స్థానాలను బట్టి జాతకం, భవిష్యత్తు ఊహించడం వంటివి ఆచరణలో లేదు.

జాతకాలు ద్వారా ఊహించి చెప్పిన భవిష్యత్తు అసలు జరగలేదని అనేక  పరిశోధనలు చెబుతున్నాయి. మానవ శరీరంపై గ్రహాల ప్రభావం ఉంటుంది అనడానికి ఎలాంటి శాస్త్రీయత లేదు. అంతే

కాదు ఈ గ్రహాల ప్రభావం మీ జాతక చక్రం పై ఆధారపడి మారుతూ ఉంటుంది, అన్నది కొసమెరుపు, అది అర్థరహితం, తర్కానికి దూరం. ఈ అశాస్త్రీయ భావాలను, నిరూపితంకాని భావజాలాన్ని ఒక బోధన అంశంగా INGOU చేయబూనడం ఓ మూఢ నమ్మకాన్ని ప్రభుత్వ సంస్థ ప్రోత్సహించడమే అవుతుంది. భారత రాజ్యాంగంలోని 51A(h)అధికరణంలో పేర్కొన్న "భారత పౌరులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి" అన్న అంశానికి ఈ చర్య పూర్తిగా వ్యతిరేకమైనది. శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని ప్రచారం చేయవలసిన బాధ్యత గల మనం అందరం ఈ అశాస్త్రీయ బోధనను వ్యతిరేకించాలి.

కేంద్ర మరియు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఒకపక్క శాస్త్రీయ పద్ధతులను తుంగలోకి తొక్కి COVID వ్యాప్తికి దోహదం చేస్తూ, మరొక పక్క తప్పుడు అంకెలు-సంఖ్యలు ప్రచారం చేస్తూ అసలు సమాచారాన్ని ప్రజలకు దూరం చేస్తున్నాయి. శాస్త్రీయ దృక్పథం లేకుండా COVID ను ఎదుర్కొన లేము. COVID ను శాస్త్రీయంగా ఎదుర్కోవాలంటే.. ఆరోగ్యరంగంలో లాభాలే ధ్యేయంగా గల ప్రైవేట్ రంగాలను ప్రోత్సహిస్తూ, వాటి కొమ్ము కాస్తూ ప్రచారం చేస్తున్న ధోరణికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వస్తి పలకాలి. ఆ స్థానంలో ప్రభుత్వ ప్రజారోగ్య సంరక్షణ వ్యవస్థను పటిష్ఠం చేయాలి. అందరికీ వాక్సిన్ ఉచితంగా అందించే ఒక దేశవ్యాప్త పాలసీ వెంటనే అమలు చేయాలి. ఇది COVID బాధితుల గురించి, మరణాల గురించి నిజాయితీగా, నిజమైన డేటా సేకరణ తోనే సాధ్యం అవుతుంది.

ఎంతో ప్రజా ధనాన్ని వెచ్చించి ఉచిత వాక్సిన్ గురించి ఈ ప్రభుత్వాలు అనేక ప్రకటనలు గుప్పిస్తున్నాయే తప్ప క్షేత్రస్థాయిలో ఆక్సిజన్ సరఫరా, వాక్సిన్ సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయి. చివరకు COVID తో చనిపోయిన వారి శరీరాలు కూడా సరైన పద్ధతిలో ఖననం చేయలేకపోవడం అత్యంత శోచనీయం.

ఈ విషయాలను నిజాయితీగా నిర్భయంగా ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలపై ఓ క్రమపద్ధతిలో దాడి చేసి, రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేసి ,వాళ్ళ నోళ్ళు మూయిస్తున్నారు. ఈ విధంగా ప్రభుత్వమే నిజాన్ని దాచి పెట్టి తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తోంది.

ఈ నేపథ్యంలో బాధ్యత గల పౌరులుగా సభ్యులుగా మన డిమాండ్లు ఏమిటంటే...

1. జ్యోతిష్యాన్ని ,దాని అనుబంధ అంశాలను ప్రభుత్వ సొమ్ము తో నడిచే విశ్వవిద్యాలయాల్లో బోధించడాన్ని వెంటనే నిలిపివేయాలి. వాటి స్థానంలో ఖగోళ శాస్త్రాన్ని (ASTRONOMY) బోధించాలని కోరుచున్నాము.

2. ప్రజల ఆరోగ్యం కోసం సరైన ప్రజారోగ్య వ్యవస్థను పునరుద్ధరించాలి. వ్యాపారమే ధ్యేయంగా గల ప్రైవేటు ఆరోగ్య పాలసీను నిలిపివేయాలి.

3. COVID పరిస్థితులను నిజాయితీగా ప్రచారం చేస్తున్న మీడియా పై దాడులు వెంటనే నిలిపివేయాలి.

4. రాజ్యాంగంలోని 51A(h) అధికరణాన్ని పూర్తిగా గౌరవిస్తూ, శాస్త్రీయ దృక్పథాన్ని ప్రాథమిక స్థాయిలో చురుకుగా ప్రచారం చేస్తూ, మహమ్మారిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కృషి చేయాలి.

దబోల్కర్, కల్బుర్గి, పన్సారే, లంకేష్ ల దారుణ హత్యాకాండను నిరసిస్తూ, 20.8.2021 న **"జాతీయ శాస్త్రీయ దృక్పథం దినం"** (**NATIONAL SCIENTIFIC TEMPER DAY**)గా పాటించి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుటకు కృషి చేయాలని ప్రజల, ప్రజాసంఘాలు, వివిధ విశ్వవిద్యాలయాలను కోరుతున్నాము.

*"మనలోని భిన్నత్వాలు నాగరికత అభివృద్ధికి చిహ్నాలు" — మహాత్మాగాంధీ*

**AIPSN Document translated into telugu by M.S.Ugandhar Babu, JVV(AP)**